## హనుమాన్ శోభాయాత్రకు అనుమతి ఇవ్వాలి

డబీర్‌పురా: ఈ నెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్రకు అనుమతి ఇవ్వాలని అఖిల భారత హనుమాన్ సేనా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం అఖిల భారత హనుమాన్ సేన ప్రతినిధుల బృందం మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ ఎన్.ఎస్.ఎస్.వి. వెంకటేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. డబీర్‌పురా కోమటివాడిలోని వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి ఈ హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమై కోమటివాడి, నూర్‌ఖాన్‌బజార్, నల్ల పోచమ్మ బస్తీ, కాలికబర్, ఆర్య సమాజ్, చాదర్‌ఘట్ మీదుగా కర్మన్‌ఘట్ నుంచి నిర్వహించే శోభాయాత్రలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత హనుమాన్ సేనా అధ్యక్షుడు ఎ.శివకుమార్, ప్రధాన కార్యదరిశ జె.మహేశ్‌యాదవ్, జాయింట్ సెక్రటరీ అతీత్ కుమార్ శ్రీవాత్సవ్, ఉపాధ్యక్షులు భాస్కర్ యాదవ్, హనుమంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేష్ అన్నారు. నియోజకవర్గంలోని 12 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్లరేషన్ కార్డుదారులు సన్న బియ్యం, రాజీవ్ యువ వికాసం ద్వారా యువత ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఆలస్యం జరగకుండా ఎప్పటికప్పుడు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

## మాలకుంటలో బస్తీ అభియాన్


కరపత్రాలను పంపిణీ చేస్తున్న గోపాల్‌జీ, పాండు యాదవ్


అఫ్జల్‌గంజ్: బస్తీ అభియాన్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి గోపాల్‌జీ పేర్కొన్నారు. గురువారం ఎంజే మార్కెట్ పరిధిలోని మాలకుంట రోడ్డులో బస్తీ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డి.గోపాల్‌జీ మాట్లాడుతూ..బీజేపీ హయాంలో భారతదేశం అన్ని రంగాల్లో నెంబర్:1 స్థాయిలో ఉందన్నారు. ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండు యాదవ్, వనమాల గోపాల్, రాజ్‌కుమార్, జగపతి, అమర్‌సింగ్, మయూర్ కలేకర్ పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అఫ్జల్‌గంజ్: చుడిబజార్‌లోని రామ్‌మనోహర్ లోహియా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..9 ఏళ్ల క్రింద అప్పటి హోంమంత్రి నాయినీ నర్సింహారెడ్డి చొరవతో రామ్‌మనోహర్ లోహియా ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నేటి వరకు పనులు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్‌కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహవీర్ జయంతి


వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా

గన్‌ఫౌండ్రీ: మహవీర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ జైన్, అశోక్, ప్రదీప్ జైన్, బావేష్‌షా తదితరులు పాల్గొన్నారు.

# కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్, లంగర్‌హౌస్, గోల్కొండ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఆయన వద్దకు వచ్చి తమ తమ సమస్యలను విన్నవించారు. నల్లాల్లో వస్తున్న నీరు సరిపోవడం లేదని ఎన్నోసార్లు లో ప్రెషర్‌తో వస్తుందని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. తమ బస్తీలోని వీధుల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతుందని మరికొందరు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాహనాల రాకపోకలతో డ్రైనేజీ పైప్‌లైన్‌లు దెబ్బతింటున్నాయని పలుచోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పగిలి మురుగు నీరు రోడ్ల పైకి వస్తుందన్నారు. అయితే వీటిని వెంటనే అధికారుల దృష్టికి తెచ్చి కొత్త పైప్‌లైన్లు, మ్యాన్‌హోల్ మూతలు వేయిస్తున్నామన్నారు. ఎక్కడ కూడా డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించకూడదని తాను జలమండలి అధికారులను ఆదేశిస్తానన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు ప్రతినిత్యం వస్తున్నాయని అయితే వీటిని వెంటవెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. తాగునీటి సరఫరాకు ఎటువంటి కోతలు లేవని, కార్వాన్ నియోజకవర్గానికి సరిపడా నీరు సరఫరా అవుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల పలుచోట్ల లో ప్రెజర్‌తో నల్లాల్లో నీరు వస్తుందన్నారు. అటువంటి ప్రాంతాలను గుర్తించి వాటిని అధికారులకు తెలుపుతానన్నారు. అటువంటి ప్రాంతాల్లో బూస్టర్లు పెట్టి నీటి ప్రెజర్ పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీధిలైట్ల నిర్వహణపై కూడా గత వారం తాను అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానన్నారు. ముఖ్యంగా బస్తీల అంతర్గత రోడ్లల్లో ఉన్న వీధి దీపాలను అధికారులు పట్టించుకోవడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పలుచోట్ల హైమాస్ట్ లైట్లు అలంకారప్రాయంగా మారిన దృశ్యాలను తాను స్వయంగా చూశానన్నారు. బల్దియా వీధిదీపాల విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. అయితే త్వరలోనే తాను విద్యుత్ దీపాల మరమ్మతు పనులు చేయిస్తానన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

## 'కళాకారులకు అవార్డులు ఉత్తేజాన్నిస్తాయి'


అవార్డు గ్రహీతలతో రాంచంద్రారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: కళాకారులకు అవార్డులు ఉత్తేజాన్నిస్తాయని పలువురు ప్రముఖులు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ పేరిట పలువురు సినీ నటులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సినీ నటుడు ధన్‌రాజ్ మాట్లాడుతూ..కళాకారుల ప్రతిభను గుర్తించి అవార్డులను ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. సినీనటి హర్షిత మాట్లాడుతూ..చిన్నా పెద్ద అనే తేడా లేకుండా నటీనటుల ప్రతిభకు అవార్డులే తలమానిక్యంగా నిలుస్తాయని కొనియాడారు. అంతకు ముందు కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు దిలిప్‌కుమార్, కార్యదర్శి రాంచంద్రారెడ్డి, బలగం ఫేమ్ మొగులయ్య, బలగం సంజయ్, రవీందర్‌రెడ్డి, మురళీధర్ గౌడ్, దాసరి రంగా తదితరులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలి

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలి అని నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ జి.నవనీత అన్నారు. గురువారం కోఠిలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు చైర్మన్‌ను నియమించలేదని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో నియమించిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నియమించలేదన్నారు. ఇప్పుడైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో, పోలీస్ శాఖలో, ప్రభుత్వ హాస్టళ్లలో బార్బర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 19న పాలిసెట్ దరఖాస్తుకు చివరి గడువు

శాలిబండ: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (పాలిసెట్)-2025 దరఖాస్తు కోసం ఈ నెల 19న చివరి తేదీ అని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాల కో ఆర్డినేటర్ విక్రమ్ వంశీరెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీలకు రూ.250లు, ఇతరులు రూ.500 ఫీజులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 ఆలస్యం రుసుంతో ఈ నెల 21వ తేదీ వరకు, తత్కాల్ ఫీజు రూ.300లతో ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మే 13న పాలిసెట్ ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు.

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి


బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు, అధికారులు

యాకుత్‌పురా: పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. నియోజకర్గంలోని యాకుత్‌పురా, బడాబజార్, మాతకి కిడికి, గంగానగర్ నాలా, డబీర్‌పురా దర్వాజా తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు, అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..డబీర్‌పురా హైదర్ హోటల్ వద్ద రూ.20 లక్షలతో తాగునీటి పైప్‌లైన్, మోతీ మసీదు ప్రాంతాల్లో రూ.14 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టామన్నారు. బస్తీ, కాలనీల ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలో రెయిన్‌బజార్, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలందార్ వాలాజాహి, మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, నాయకులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

అబిడ్స్: ద్విచక్ర వాహనాలను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని షాహినాయత్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నందిపాటి రాములు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాలకు చెందిన మనోజ్‌కుమార్ వ్యాస్, ఒడిశాకు చెందిన తపస్ అల్దార్, అశోక్, చుడిబజార్‌కు చెందిన పంకజ్‌కుమార్ శివాల్ ఒక ముఠాగా ఏర్పడి పలు కాలనీలు, బస్తీల్లో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలను నకిలీ తాళం చెవిలతో దొంగిలించి తప్పించుకు తిరుగుతున్నారు. చుడిబజార్‌లో ఫిబ్రవరిలో ఓ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైంది. ఆ యజమాని సంతోష్‌కుమార్ షాహినాయత్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై భరత్‌రెడ్డి, బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, బర్తన్‌బజార్, అశోక్‌బజార్ ప్రాంతాల్లోన్ని సీసీ టీవీలను పరిశీలించారు. అందులో మనోజ్‌కుమార్ వ్యాస్, పంకజ్‌కుమార్, తపస్ అల్దార్‌ను గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద 6 ద్విచక్ర వాహనాలను స్వాధీన పరచుకున్నారు.

## బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం


ఎమ్మెల్సీ శ్రవణ్‌ను సన్మానిస్తున్న శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. గురువారం ఆయనను లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద గల బీఆర్‌ఎస్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాజీ సీఎం కేసీఆర్‌కు పేద ప్రజలే ఊపిరి అని అన్నారు. తన పదేళ్ల పాలన కాలంలో కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు పరిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మరోవైపు మాజీ మంత్రి కేటీఆర్ యువతకు వెలుగు రేఖగా ఉంటూ రాష్ట్రంలో ఉపాధి కల్పనకు ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఆర్‌ఎస్ ఒక్కటే అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, సాగర్ తదితరులున్నారు.

## బోయిగూడలో అగ్ని ప్రమాదం



నాంపల్లి: ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులోని గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయిగూడ కమాన్ వద్ద చోటుచేసుకుంది. ఓ ఐదంతస్తుల భవనంలో మార్వాడి కుటుంబం నివాసం ఉంటోంది. ఈ భవనంలోని ఐదో అంతస్తులో తన వ్యాపారానికి చెందిన గోడౌన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గోడౌన్‌లో తలెత్తిన షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎగిసిపడుతున్న మంటలను అపార్ట్‌మెంట్ కుటుంబసభ్యులు, స్థానికులు గమనించారు. దట్టమైన పొగలతో ఆ ప్రాంగణమంతా వ్యాప్తి చెందడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక దళం ఐదవ అంతస్తులో కాలిపోతున్న గోడౌన్‌లోని మంటలను ఒక్కసారిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఆస్తినష్టం పెద్ద మొత్తంలో జరిగిందని యజమాని మహవీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మహిళలకు రవాణా భద్రతను మరింత మెరుగుపరచాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, రూపొందించిన చట్టాలను తెలుసుకోవాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ శ్రీవిద్యా అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని కళాశాలలో తెలంగాణ మహిళల భద్రత విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఉమెన్ సేఫ్టీ క్లబ్ వారు 'టువర్డ్స్ సేఫ్ మొబిలిటి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రవాణా భద్రతను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఉబర్ రైడ్స్ వారు టీ-సేఫ్ కార్యక్రమంతో కలిసి తాము కూడా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రమారాజేశ్వరి మాట్లాడుతూ.. జి.నారాయణమ్మ కళాశాల విద్యార్థినులు ఎంతో చురుకైన వారని పదేళ్లుగా తాను జీఎన్‌ఐటీఎస్ యాక్టివిటీస్‌ను పరిశీలిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్‌ఐటీఎస్ చైర్మన్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, అభయ కన్వీనర్ అపర్ణ, డాక్టర్ ఎం.వి.ఎల్.సూర్యకుమారి పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే ఎక్సలెన్సీ అవార్డుకు ఆర్.కృష్ణయ్య ఎంపిక



అబిడ్స్: ఆర్.కృష్ణయ్యను మహాత్మా జ్యోతిరావు పూలే ఎక్సలెన్సీ అవార్డు-2025కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ మహమ్మద్ అక్తర్ అలీ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం రాష్ట్ర శాఖ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో తెలంగాణ నుంచి ఒక్కరికి ఇచ్చే అవార్డును ఆర్.కృష్ణయ్యకు ఎంపిక చేశామన్నారు. ఈనెల 11న ఉదయం 11: 30 గంటలకు విద్యానగర్‌లోని తన నివాసం బీసీ భవన్‌లోని సమావేశం హాల్‌లో పూలే జయంతి పురస్కరించుకొని ఆర్.కృష్ణయ్యకు మెమెంటో సన్మాన పత్రంతో ఘనంగా సన్మానిస్తున్నట్టు తెలిపారు.

## పీసీసీ మైనార్టీ సెల్ చైర్మన్‌ను వెంటనే నియమించాలి


మైనార్టీ నేతల సమావేశం

నాంపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని పలువురు నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ఉర్దూ ఫోరం అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ నివాసంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.అఫ్జలుద్దీన్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ-మైనార్టీల సమస్యలు అనే అంశంపై సదస్సు జరిగింది. మైనార్టీ నేతలు మహ్మద్ ఐజాజ్ ఉజ్జమా, మహ్మద్ సనావుల్లా ఖాన్, ఆర్షియా, సహానా ఖాన్, డాక్టర్ ఆర్షియా జబీన్ సిద్దిఖీ, సహారా ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్.కె.అఫ్జలుద్దీన్ మాట్లాడుతూ..గాంధీ భవన్‌లో మైనార్టీ నేతలు కూర్చునేందుకు ప్రత్యేక గది లేదన్నారు. గడచిన ఆరు నెలలుగా మైనార్టీ సెల్ విభాగం మూతపడిందని పేర్కొన్నారు. కాబట్టి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం తక్షణమే స్పందించి మైనార్టీ సెల్ విభాగానికి కొత్త చైర్మన్‌ను నియమించాలని కోరారు. తెలంగాణ ఉర్దూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో సముచితమైన స్థానం కల్పించాలని కోరారు.

## అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చార్మినార్: డిగ్రీలో అత్యున్నత గ్రేడు సాధించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకంలో భాగంగా సిటీ కళాశాల ఎం.కామ్. విద్యార్థులు ఐదుగురు 2024-25 విద్యా సంవత్సరానికి గాను జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ తెలిపారు. ఈ పథకం కింద నలుగురు విద్యార్థులు మూడు లక్షల చొప్పున, ఒక విద్యార్థి లక్షా యాభైవేల చొప్పున అందుకున్నారు. కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కామర్స్ అధ్యాపక బృందం వారిని అభినందించారు. వారి అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఈ స్కాలర్‌షిప్ లభించిందని, ఇది వారి కృషిని, పట్టుదలని సూచిస్తుందన్నారు.

## హనుమాన్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించాలి

అబిడ్స్: హనుమాన్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించాలని అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ పేర్కొన్నారు. అబిడ్స్ పోలీస్ స్టేషన్లో జరిగిన మైత్రి సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్ని ఆలయాల వద్ద, ప్రధాన కేంద్రాలు బస్తీల్లో పోలీసులు ప్రత్యేక బందవస్తు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. హనుమాన్ జయంతి వేడుకలు, శోభాయాత్రలు విజయవంతంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు నైతిక సభ్యుల కృషి ఎంతో అవసరమన్నారు. ఎలాంటి సమాచారం ఉన్న స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు.


సమావేశంలో అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్

## అంతర్రాష్ట్ర మద్యం సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: అంతర్రాష్ట్ర మద్యాన్ని నగరానికి దిగుమతి చేసే వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా గురువారం హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో సోదాలు జరిపారు. ప్లాట్‌ఫారం నెం-6 మీద బ్యాగ్‌తో రైళ్లలో పనిచేసే ఒక బెడ్ రోలర్ వేచి ఉండటాన్ని గమనించారు. అడ్డగించి బ్యాగు తెరి చూడగా అందులో వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం బాటిల్స్ కనిపించాయి. ఈ మద్యాన్ని హరియాణా నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లుగా బెడ్ రోలర్ ఒప్పుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అమానిగంజ్ చోయ్, ఫైజాబాద్‌కు చెందిన రామ్ సరన్ కుమారుడు శివ 'జైపూర్-హైదరాబాద్' నగరాల మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో బెడ్ షీట్లను మార్చే బెడ్ రోలర్‌గా పనిచేస్తున్నారు. అతను ఓ కాంట్రాక్టర్ కింద రైళ్లలో బెడ్ షీట్స్‌ను శుభ్రం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. హరియాణాలో తక్కువ ధరకు లభించే బ్లెండర్స్ ప్రైడ్-18 బాటిల్స్, 8 పీఎం-10 విస్కీ బాటిల్స్‌ను హైదరాబాద్‌కు రైలులో తీసుకువచ్చాడు. వీటి విలువ సుమారు రూ.32,160 గా ఉంటుందని హైదరాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అంతర్రాష్ట్రానికి చెందిన మద్యాన్ని సరఫరా చేసేందుకు అతడి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



## కార్వాన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి


కార్వాన్ డివిజన్ బీజేపీ కమిటీ సమావేశం

గోల్కొండ: కార్వాన్ డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ అన్నారు. గురువారం కార్వాన్ సరస్వతీ శిశుమందిర్‌లో కార్వాన్ డివిజన్ బీజేపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన విజయాలు కూడా ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. పదేళ్ల పరిపాలన కాలంలో నరేంద్రమోదీ దేశాన్ని పటిష్ట పరిచి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం గురించి కూడా వివరించాలన్నారు.